ప్రతి ఇంట.. ఆరోగ్యాల పంట



కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఏఎన్‌ఎం జగదీశ్వరి



పేదలకిచ్చిన హామీలు పదవినలంకరించిన క్షణం నుంచి అమలు చేస్తోన్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కింది. గత ప్రభుత్వంలో ప్రకటించిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలన్నీ దాదాపు పదవీ కాలం ముగిసిపోవడానికి ఒకటి రెండు మాసాల ముందు ప్రజలకు విదిల్చి మళ్లీ లబ్ధి పొందాలని నాటి నాయకులు చూశారు. ఈ పరమార్థం గ్రహించారు కనుకనే ప్రజలు మరోసారి పొరపాటు చేయలేదు.

జగనన్నకు ఒకసారి అవకాశం ఇచ్చి చూద్దామని ఆయన్ని గెలిపించారు. ప్రజల నమ్మకాన్ని సీఎం జగన్ వమ్ము కానీయకుండా సీఎం అయిన నాటి నుంచి నేటి వరకు పేదలకు ఎప్పుడు ఏం చేద్దామా అని తపిస్తూ పాలన సాగిస్తున్నారు. అందుకే పేదలంతా ముక్తకంఠంతో మళ్లీ మా ముఖ్యమంత్రి జగనే అంటూ ఎలుగెత్తి చాటుతున్నారు.

- **రూ.25 లక్షల వరకు పరిధి పెంచిన కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ**
- **35వ వార్డులో 4,950 మంది లబ్ధిదారులకు అందజేత**
- **ప్రతి లోగిలిలో మార్మోగుతున్న సీఎం జగన్ నామస్మరణ**

జగదాంబ : పేదల సంపూర్ణ ఆరోగ్యం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నో పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోంది. నాడు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందించి ఎన్నో ప్రాణాలు కాపాడిన నేపథ్యంలో జగనన్న కూడా పేదల ఆరోగ్యం కోసం చక్కటి పథకాలు అమలు చేస్తున్నారు. తండ్రి పేదల అందుబాటులోకి తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీని మరింత మెరుగుపరిచారు. గతంలో కంటే మరిన్ని వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చారు.



వెలంపేటలో ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకుంటున్న లబ్ధిదారులు

రూ. 25 లక్షల వరకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే వెసులుబాటు కల్పిస్తూ సరికొత్త ఆరోగ్యశ్రీ కార్డులు పేదలకు అందజేస్తున్నారు. దీంతో పేదల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రతి ఇంటా జగనన్న పేరు మార్మోగుతోంది.

35వ వార్డులో 4,950 ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ..

జీవీఎంసీ 35వ వార్డులో 4,950 కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు లబ్ధిదారులకు అందజేశారు. సచివాలయ ఏఎన్‌ఎంల ద్వారా కల్లుపాకలు, వెలంపేట, దుర్గమాంబ సమాజం, ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, లక్ష్మీనగర్, నూనెమిల్లువీధి, గాజులవీధి, ఫెర్రీవీధి, స్ప్రింగ్‌రోడ్డు, పువ్వుల వీధిలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ జరిగింది.

జగన్‌బాబు ఆరోగ్య భద్రత కల్పించాడు..



చిన్నపాటి వైద్యం కూడా చేయించుకోలేని మాలాంటి వారెందరికో ఈ ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా పెద్దపెద్ద ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే అవకాశం జగన్‌బాబు కల్పించాడు. ఆయన పేదలకు అన్నీ ఇస్తున్నాడు.

– రామలక్ష్మి, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు

పేదలకు అండ జగనే..



పేదలకు అండగా నిలిచేది జగనన్న ప్రభుత్వమే అని అందరికీ అర్థమయింది. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునేలా రూ. 25 లక్షల విలువ గల ఆరోగ్యశ్రీ కార్డు ఇచ్చారు. ఆయనుంటే పేదలకు ఏ చీకూ చింతా ఉండదు.

– అరుణ, పండావీధి, 35వ వార్డు

ఆరోగ్యం గురించి ఆందోళన లేకుండా చేశారు..



రూ. 25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యం చేయించుకునే వెసులుబాటు జగనన్న కల్పించారు. దీంతో ఆరోగ్యం గురించి ఆందోళన లేకుండా చేశారు. అభివృద్ధి, సంక్షేమమే కాదు.. జగనన్న పేదల కోసం ఏదైనా చేస్తారు.

– దుర్గ, వెలంపేట, 35వ వార్డు

మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి..



జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డు వంటివి పేదలకు ఇచ్చి ఆరోగ్యం గురించి ఎలాంటి భయం లేకుండా సీఎం జగన్ భరోసా కల్పించారు. పేదలకు ఇన్ని రకాలుగా అభయం ఇస్తున్న ఆయనే మళ్లీ సీఎం కావాలి.

– లక్ష్మి, దుర్గమాంబ సమాజం, 35వ వార్డు

ప్రతి ఇంట ఆనందమే..




ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తుంటే ప్రతి కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది. పేదల ఆరోగ్యం కోసం సీఎం జగన్ తీసుకుంటున్న శ్రద్ధకు అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

– జగదీశ్వరి, ఏఎన్‌ఎం, ప్రసాద్‌గార్డెన్స్ సచివాలయం

క్లుప్తంగా

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో శ్రీసూర్యనారాయణమూర్తి

అల్లిపురం : వెంకటేశ్వర మెట్టపై అలమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో మాఘ మాసం మూడవ ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు ప్రత్యేకంగా గోక్షీరంతో అభిషేకం, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం మందార, చామంతి, గులాబీ పుష్పాలతో స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ఉషా ఛాయా సమేత సూర్యనారాయణస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

అతిగా మద్యం తాగి యువకుడి మృతి



యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీస్ సిబ్బంది

అల్లిపురం : అతిగా మద్యం సేవించి యువకుడు మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం మల్కాపురం గాంధీగ్రామ్‌లో నివస్తున్న పి.జేమ్స్‌రాజ్ (30) హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్‌లో బ్లాస్టింగ్ కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి మద్యం తాగి నగరానికి చేరుకున్నాడు. డాబాగార్డెన్స్ దరి భీమ్‌నగర్‌లో గల నిరాశ్రయ వసతి గృహం సమీపంలో రోడ్డుపై పడిపోయాడు. ఈ విషయాన్ని స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెప్పించిన స్టోరీ టెల్లింగ్

సీతంపేట : ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో భారతీయ విద్యాభవన్ సహకారంతో ఆదివారం మియావాకీ స్టోరీ టైంలో కామిషిబాయి అని పిలువబడే సాంప్రదాయ జపనీస్ కథ చెప్పే పద్ధతిని విద్యార్థులకు పరిచయం చేశారు. కథాలయ ఫౌండేషన్‌కు చెందిన ప్రముఖ కథకురాలు వరలక్ష్మి జపనీస్ స్టైల్‌లో భారతీయ జానపద కథను వివరించారు. కథన శైలి, మాడ్యులేషన్ ఎలా ఉండాలో వివరించారు. వివిధ వాయిద్యాలతో సంగీతాన్ని జోడించడంతో సెషన్ మరింతగా మెప్పించింది. నగరంలో వివిధ పాఠశాలలకు చెందిన 65 మంది విద్యార్థులు ఈ సెషన్‌లో పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం

డాబాగార్డెన్స్ : వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ విశాఖపట్నానికి నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. సంస్థ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు కె. రవిచంద్రన్, డిస్ట్రిక్ట్ గవర్నర్ అద్దగాల వీవీ గుప్త అధ్యక్షుడిగా ఎన్నికైన కంకటాల సతీష్, ప్రధాన కార్యదర్శి ముమ్మిడివరపు విజయ్‌కుమార్, కోశాధికారి పాలూరి వెంకట చిదంబరంతో ప్రమాణ స్వీకారం చేయించారు. సేవా కార్యక్రమంలో భాగంగా ఆర్య వైశ్య స్టూడెంట్స్ హాస్టల్‌కు వంట పాత్రలు, హిడెన్ స్పాట్స్ స్కూల్ ఫర్ మెంటల్లీ ఛాలెంజ్డ్ పర్సన్స్‌కు పచారీ సరుకులు, ముగ్గురు నిరుపేదలకు జీవనోపాధి కల్పించే ఉద్దేశమై కుట్టుమిషన్లు అందజేశారు. కంకటాల ప్రభాకర్, కేవీ గుప్త, నల్లూరి నూకరాజు, కందుల నాగరాజు, పువ్వాడ శేష మస్తాన్‌రావు, సుగ్గు వెంకట శివకుమార్, పూసర్ల సురేష్‌కుమార్, ఆదిమూలం తిరుపతిరావు, మాదేటి రమేష్, సీహెచ్‌వీ కృష్ణమోహన్‌రావు, పీఎస్‌వీ కమలశ్రీ, సత్యనారాయణ, ఉమామహేశ్వరి, వంకాయల సాయి నిర్మల, శ్రీనివాసరావు, రామారావు, రఘు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్‌-2 పరీక్ష

- అభ్యర్థులకు పోలీసుల సూచనలు..



పరీక్ష రాసి బయటికి వస్తున్న అభ్యర్థులు

మద్దిపాలెం: ఏపీపీఎస్సీ గ్రూప్‌-2 పరీక్ష 50, 51 వార్డుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. ఆదివారం నిర్వహించి న ఈ పరీక్ష 50వ వార్డు మాధవధార జీవీఎంసీ హై స్కూల్, అలాగే 51వ వార్డులోని శ్రీపాద డిగ్రీ కాలేజీ కేంద్రాలుగా నిర్వహించారు. మాధవధార హైస్కూల్ కేంద్రంలో మొత్తం 240 మంది అభ్యర్థులకు కేటాయించగా అందులో 213 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. 27 మంది హాజరు కాలేదు. అలాగే శ్రీపాద డిగ్రీ కాలేజీ సెంటర్‌గా 288 మందికి కేటాయించగా 246 మంది అభ్యర్థులు హాజరు కాగా, 42 మంది గైర్హాజరయ్యారు.



అభ్యర్థులకు సూచలిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార : గ్రూప్‌-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం రైల్వేస్టేషన్ ప్రధాన గేటు వద్ద పోలీసులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. బస్సు రూట్‌తో పాటు పరీక్ష కేంద్రాలకు వెళ్లే మార్గాలను ఫోర్త్ టౌన్ సీఐ విజయకుమార్ అభ్యర్థులకు వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రూప్‌-2 పరీక్షలకు పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు బస్సు రూట్‌తో పాటు కేంద్రాలకు వెళ్లే మార్గం గురించి వివరించినట్లు తెలిపారు.

బౌద్ధంతోనే అసమానతలు దూరం

సీతంపేట : బౌద్ధ ధర్మం ద్వారా అసమానతలు దూరం చేయవచ్చని బౌద్ధ మేధావులు పేర్కొన్నారు. బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో 11వ బౌద్ధ మహా సమ్మేళనం నిర్వహించారు. సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో డాక్టర్ ఆయూపాల మయతెరో (మయన్మార్) సారిపుత్ర ధర్మ ప్రబోధన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను తొలగించాలంటే బౌద్ధం ఒక్కటే మార్గమన్నారు.

ఎర్నిమాంబ వార్షిక జాతర పోస్టర్ ఆవిష్కరణ



వార్షిక జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, ఈవో సురేష్‌బాబా

కంచరపాలెం : జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర పోస్టర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆవిష్కరించారు. ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఎర్నిమాంబ అమ్మవారికి ఎమ్మెల్యే వాసుపల్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం దినదినాభివృద్ధి చెందుతుండడంతో దూరప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారని, వారికి మౌలిక వసతులు, ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయ పునర్నిర్మాణం తర్వాత తొలి వార్షిక జాతర అతి వైభవంగా నిర్వహించేలా కరపత్రాలు, గోడపత్రికలతో ప్రచారం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది వార్షిక జాతర అంగరంగ వైభవంగా చేయనున్నట్లు ఈవో సురేషబాబా తెలిపారు. దాతల సహాయంతో భక్తుల కోసం నిర్మిస్తున్న షెడ్లను ఎమ్మెల్యే వాసుపల్లి పరిశీలించారు. అనంతరం ఎర్నిమాంబ అమ్మవారి ముడుపు విశేషం, స్థల పురాణం, ముడుపు కట్టుకున్న భక్తులు పాటించాల్సిన నియమాలు, సేవల రుసుములు తదితర వివరాలతో కూడిన కరపత్రాలను ఎమ్మెల్యే వాసుపల్లి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, చుక్కా శ్యామ్‌రెడ్డి, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు



తోటగరువు హైస్కూల్‌లో 2003 - 04 పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 – 04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకొన్న విద్యార్థులు ముడసర్లోవ పార్కులో ఆదివారం కలుసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల్లో ఎక్కడెక్కడో స్థిర పడిపోయిన వారంతా ఒక్కచోటకు చేరడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. 20 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో రోజంతా సరదాగా గడిపారు. తరగతి గదిలో అప్పటి సరదాలు, సంగతులు, అల్లరి, ఒకరినొకరు ఏడిపించుకోవడం వంటివన్నీ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి తోటగరువు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వరహాలురాజు, పలువురు ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం ఉపాధ్యాయులతో కలిసి అందరూ భోజనాలు చేశారు.

అభివృద్ధి పనుల వేగవంతానికి ఆదేశం

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆదివారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆమె కోరారు. జేఎస్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. స్లీప్‌గుర్తు వీధి, రాచవీధి, గెడ్డవీధి, బాబాకాలనీ, సెబాస్టియన్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు లేని వార్డుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, జేసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, వెలంగిణీరావు, శ్యామ్ సుందర్, తిరుమలరావు, జాన్సన్, కోరాడ శౌరీబాబు, ఎల్. కుమారస్వామి, అన్నపూర్ణ, దేవి, జ్యోతి, మేరీ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్

పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి

సీతంపేట : జీవితం కోసమే చదువు అని కాకుండా, జీవితంలో అన్ని పరిస్థితులను ఎదుర్కొనేలా మన పిల్లలను తయారు చేయాలని ఐఆర్‌ఎస్ అధికారి ఈదర కిరణ్‌కుమార్ అన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో పిల్లల విద్యలో రావలసిన మార్పులు అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెరగాలని, నేటి చాట్ జీపీటీ యుగంలో ఒట్టి జ్ఞాపక శక్తి, బట్టీ చదువులకు చోటే లేదన్నారు. మార్కులు, ర్యాంకులపై వేలం వెర్రి తగ్గాలని సూచించారు. చిన్నతనం నుంచే ఇష్టమైన హాబీలు అలవర్చుకోకుంటే జీవితం యాంత్రికం అయిపోతుందన్నారు. పిల్లలు రోజూ ఆంగ్ల దినపత్రిక చదివేలా ప్రోత్సహించాలని సూచించారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ పిల్లల్లో అనేక రకాల మేధో కుశలతలు ఉంటాయని, ప్రతి విద్యార్థిని ఒక ప్రత్యేక వ్యక్తిగా చూడాలన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ సదస్సులో చర్చించిన విషయాలు, విద్యా విధానంలో రావాల్సిన మార్పుల గురించి పాఠశాలలకు ఉపయోగపడేలా నిర్దిష్ట ప్రణాళిక తయారు చేసి రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు పంపనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఐఆర్‌ఎస్ అధికారి ఈదర కిరణ్‌కుమార్

10న గోల్డ్ అప్రైజర్స్ ద్వితీయ మహాసభ

సీతమ్మధార : ఆల్ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ ద్వితీయ మహాసభ మార్చి 10న విజయవాడ సిద్ధార్థ అకాడమీ (మొగల్రాజపురం)లో జరుగుతుందని గౌరవ అధ్యక్షుడు పడాల రమణ, అప్రైజర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదరాడ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెట్ల వెంకట బాలగంగాధర్, పక్కి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సంఘీభావం తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఇష్టానుసార పార్కింగ్‌పై కొరడా

విశాఖ సిటీ: రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేసే వారిపై చర్యలకు పోలీస్ శాఖ సమాయాత్తమవుతోంది. రోడ్లపై, నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలపడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారికి చలానాలు వేయాలని నిర్ణయించింది. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు నగర పరిధిలోని షాపింగ్ మాల్స్, ప్రధాన షాపుల యాజమాన్యంతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వాహనాలు రోడ్ల మీద కాకుండా సెల్లార్ పార్కింగ్ చేసుకునేలా చూడాలని సూచించారు. నగరంలో వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వారిపై మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం రూ.1000 జరిమానా విధించనున్నారు. వాహనాలను టోయింగ్ రికవరీ వ్యాన్‌తో తీసుకువెళ్లి, వీల్ లాక్స్ చేయడం జరుగుతుందని ఏడీసీపీ(ట్రాఫిక్) శ్రీనివాస్ స్పష్టం చేశారు. అలాగే పార్కింగ్ సౌకర్యం ఉండి పార్కింగ్‌నకు వినియోగించని షాపుల యాజమాన్యంపై కూడా చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు, వాహన యజమానులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే సెక్షన్ 190ఏ మోటార్ వాహనాల చట్టం ప్రకారం వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తారని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై, మోటార్ వాహన నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ద్విచక్ర వాహనాన్ని నడిపే సమయంలో హెల్మెట్ విధిగా ధరించేలా వారిని అప్రమత్తం చేయాలని సూచించారు.

మార్చి 3,4 తేదీల్లో ఘంటసాల వర్ధంతి

సీతమ్మధార : అమర గాయకుడు, గాన గంధర్వుడు ఘంటసాల 50వ వర్ధంతి మార్చి 3,4 తేదీల్లో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐడిల్ గంధర్వ ఏపీ-2024 పేరిట నిర్వహిస్తున్నట్లు ఘంటసాల స్మారక పీఠం ఉత్తరాంధ్ర వ్యవస్థాపకుడు డాక్టర్ టి.శరత్‌కుమార్ తెలిపారు. ద్వారకానగర్‌లోని సంఘం కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాడుతా తియ్యగా మాదిరి ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్టు ద్వారా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో ఉన్న 9 సంవత్సరాల నుంచి 80 సంవత్సరాల వయసు గల గాయనీ గాయకులకు పాటల పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4వ తేదీన ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్ట్ లోగో ఆవిష్కరణతో పాటు ఘంటసాల స్వర పోషకులు, గాయకుడు దాము గేదెలకు జీవన సాఫల్య పురస్కారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినీ హీరో సుమన్, మిమిక్రీ ఆర్టిస్ట్, సినీ నటుడు శివారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని అన్నారు. దాము గేదెల మాట్లాడుతూ భవితరాలకు ఘంటసాల గాన మాధుర్యాన్ని అందించేందుకు ఐడిల్ గంధర్వ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మాధవీకృష్ణ, శ్రీమాతా మ్యూజిక్ అధినేత పల్లి నాగభూషణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శరత్‌చంద్ర

పలు వ్యాధులకు హోమియోలో దివ్యమైన చికిత్సలు

మహారాణిపేట : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ (విశాఖ శాఖ) ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు హోమియో సూత్రాలతో తయారు చేసిన బవెల్ నొసోడ్స్ దోహదపడతాయని సంస్థ జాతీయ సంయుక్త కార్యదర్శి డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన విశాఖ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఫాస్ట్ ఫుడ్స్ భుజించడం, సరైన సమయంలో ఆహారం తినకపోవడం వంటి కారణాల వల్ల ప్రేగుల్లో ఉత్పన్నమయ్యే సమస్యల గురించి ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఈ సమస్యకు బవెల్ నోసోడ్స్ ద్వారా దివ్యమైన చికిత్స చేయవచ్చన్నారు. అనంతరం నిరంతర వైద్య విద్యా కార్యక్రమాల కన్వీనర్ డాక్టర్ వి.హేమలత నిర్వహణలో జరిగిన హోమియో వర్క్‌షాప్‌లో సీనియర్ హోమియో వైద్యుడు డాక్టర్ బి.ఎస్.వెంకటేశ్వరరావు వైవిధ్యమైన చికిత్సా విధానాలను బోధించారని ఉపాధ్యక్షులు డాక్టర్ శివకాంతి తెలిపారు. దివికేగిన హోమియో నిష్ణాతులు స్వర్గీయ డాక్టర్ కేపీవీ పద్మనాభానికి నివాళులు అర్పించారు. డాక్టర్లు హేమలత, రాజా శ్రీకాంత్, బి.వి. అభిలాష్, ఎస్.ఆనందరావు సభలో మాట్లాడారు.



డాక్టర్ పద్మనాభం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న హోమియో వైద్యులు

'బొమ్మా నీ పేరేమి' పుస్తకావిష్కరణ

సీతంపేట : గజల్ గాయని, రచయిత్రి జ్యోతిర్మయి మళ్ల రచించిన 'బొమ్మా బొమ్మా నీపేరేమి' పుస్తకావిష్కరణ సభ ఆదివారం స్థానిక పౌర గ్రంథాలయంలో జరిగింది. ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ జాయింట్ సెక్రటరీ గునాల నిర్మల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పుస్తకంలో తెలుగు వర్ణమాలలోని 54 అక్షరాలలో ప్రతి ఒక్క అక్షరాన్ని అందమైన వర్ణ చిత్రంగా ఆమె మలిచారన్నారు. ఒక్కొక్క బొమ్మకి ఒక గేయం రాసి, అన్నింటినీ కలిపి అందమైన రంగుల పుస్తకంగా రూపొందించారని తెలిపారు. రచయిత్రి జ్యోతిర్మయి మాట్లాడుతూ ఇందులో గేయాలన్నీ రాగయుక్తంగా పాడుకుంటూ పిల్లలు అక్షరాలు నేర్చుకునేందుకు ఉపయోగపడే అందమైన ప్రక్రియ అన్నారు. ఈ పుస్తకానికి ప్రముఖ వ్యంగ్య చిత్రకారుడు బయదేవ్ బాబు అందమైన ముఖచిత్రం చిత్రించారన్నారు. ఉపాధ్యాయిని విజయభాను కోటే పుస్తక సమీక్ష చేశారు. అక్షరంపై పిల్లలకు ఆసక్తి కలిగించాలనే బలమైన ఉద్దేశం ఈ ప్రయత్నంలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గునాల నిర్మల, రచయిత డి.వి.సూర్యారావు, తెలుగు దండు పరవస్తు సూరి, పుక్కళ్ల రామకృష్ణ, శేఖరమంత్రి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గునాల నిర్మల